జాతీయ స్థాయి హాకీ పోటీలకు శాంతి ఎంపిక

ప్రజాశక్తి- చాగల్లు

జాతీయ స్థాయి హాకీ పోటీలకు చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఉయ్యూరు శాంతి ఎంపికైంది. గత నెల నవంబర్ 19 నుంచి 22వరకూ విశాఖ జిల్లా నక్కపల్లిలో జరిగిన అండర్-19 ఎస్‌జిఎఫ్ హాకీ పోటీల్లో ఆమె పశ్చిమగోదావరి జిల్లాకు ప్రాతినిథ్యం వహించింది. జట్టును ఫైనల్స్‌కు చేర్చడంలో ప్రధాన పాత్ర పోషించింది. ఆమె ప్రతిభతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని పీడీ జె.విజయలక్ష్మి తెలిపారు. ఈనెల 2 నుంచి 6వరకూ గ్వాలియర్‌లో జరగనున్న జాతీయ స్థాయి హాకీ పోటీల్లో శాంతి పాల్గొంటుందని తెలిపారు. ఎంపికైన శాంతిని హెచ్‌ఎం ఎస్.వాసవి, ఉపాధ్యాయులు, సిబ్బంది, ఎస్‌ఎంసి చైర్మన్ నందిని అభినందించారు.

టిడిపి, వైసిపి మధ్య రాజుకున్న వైరం

- ఫ్లెక్సీ వివాదంతో ఆరంభం
- చోడవరం ఘటనతో ముదిరిన వైనం
- దుమారం రేపుతున్న అరెస్టుల వ్యవహారం

ప్రజాశక్తి - కొవ్వూరు

వైసిపి అధినేత, మాజీ ముఖ్య మంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ టిడిపి, వైసిపి మధ్య వైర్యాన్ని పెంచాయి. నల్లజర్ల మండలం చోడవరంలో వైసిపి శ్రేణుల అరెస్టు వ్యవహారం ఇరు పార్టీల మధ్య పెను దుమారమే లేపుతుంది. ఇరు పార్టీలు రాజకీయ కోణంలో ఈ వ్యవహారాన్ని చూడడంతో రాష్ట్రంలో ఈ అంశం హాట్ టాపిక్‌గా మారింది. జగన్ ఫ్లెక్సీకి మేకపోతును బలిచ్చి రక్తాభిషేకం చేయడం ద్వారా విద్వేషాలు రెచ్చగొట్టి, ప్రజలను భయ భ్రాంతులను చేయడానికి వైసిపి కుట్ర చేస్తుందని టిడిపి ఆరోపణలు గుప్పిస్తుంది. జగన్ అరాచక పాలన, రాక్షసత్వానికి ఈ ఘటన ఒక నిదర్శనం అంటూ జగన్ పార్టీని ప్రజలకు దోషిగా చూపించేందుకు టిడిపి ప్రయత్నిస్తుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక చోడవరం లాంటి ఘటనలు అనేక ప్రాంతాల్లో జరిగాయని వైసిపి వాదిస్తుంది. అనంతపురంలో జూన్ 7న 20 పొట్టేళ్లను బహిరంగంగా నరికి బాలకృష్ణ ఫ్లెక్సీకి రక్తాభిషేకం చేసి, పొట్టేళ్ల తలలను కటౌట్‌కు దండ గా వేసినప్పుడు ఏం చర్యలు తీసుకున్నారని వైసిపి నేతలు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. చట్ట ప్రకారం అరెస్టులు చేయదలిస్తే పోలీసులు ప్రతిపక్ష పార్టీ పట్ల వివక్ష చూపిస్తున్నారనే అంశాన్ని వైసిపి నేతలు ప్రజల్లోకి తీసుకెళుతున్నారు. అనంతపురం ఘటనలో కూటమి ప్రభుత్వ అనుసరించిన వైఖరినీ వైసిపి ప్రశ్నిస్తుంది. దళిత యువకుల్ని విచక్షణా రహితంగా కొట్టారని, సంఘవిద్రోహ శక్తుల మాదిరిగా వారిని రోడ్లపై నడిపించారంటూ వైసీపీ నేతలు కూటమి ప్రభుత్వంపై కౌంటర్ ఎటాక్‌కి దిగారు. అదే సామాజిక వర్గానికి చెందిన హెూం మంత్రి, ఎంఎల్‌ఎల ప్రోద్బలంతోనే చోడవరంలో కేసులు బనాయించారనే వాదనను వైసిపి ప్రజల్లోకి తీసుకెళ్తోంది. ఇరుపార్టీలు చోడవరం వ్యవహారాన్ని సమర్థించుకుంటూ అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నాయి.

రప్ప రప్ప ఫ్లెక్సీతో మొదలైన వివాదం

గోపాలపురం నియోజకవర్గం ద్వారకాతిరుమల మండలం రామసింగవరంలో జగన్ బర్త్డే ఫ్లెక్సీపై వివాదాస్పదమైన వ్యాఖ్యలు రాయడం అరెస్టులకు దారితీసింది. ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన వారిని అరెస్ట్ చేయడమే కాకుండా ఫ్లెక్సీ ముద్రించిన దుకాణాన్ని సైతం పోలీసులు సీజ్ చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంసమైంది. ఎపిసోడ్ అక్కడితో ముగిసింది. ఇదే ఫ్లెక్సీ అంశంపై ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు నల్లజర్ల సమావేశంలో ప్రస్తావించడం వైసిపి శ్రేణుల్లో ఆగ్రహాన్ని తెప్పించింది. నల్లజర్ల మండలం చోడవ రంలో వైసిపి కార్యకర్తలు జగన్ ఫ్లెక్సీకి మేకపోతు ను బలి ఇచ్చి ఫ్లెక్సీకి రక్తాభిషేకం చేశారు.మేకను నరికిన వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.ఈ పోస్ట్ పై పోలీసులు రాత్రికి రాత్రే స్పందించారు.బహిరంగ ప్రదేశంలో జంతుబలి ఇచ్చారని, విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వ్యవ హరించారని ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకుని స్టేషన్ కి తరలించారు. పంచాయతీ కార్యదర్శి వద్ద నివేదిక తీసుకుని వారిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.తమ దైన స్టైల్ లో నిందితులకు ట్రీట్మెంట్ కూడా ఇచ్చారు.అంతా చట్టప్రకారమే చేశామని పోలీసులు సమర్థించు కుంటున్నారు.

పోలీసుల అత్యుత్సహంపై విమర్శల

చోడవరం కేసులో నిందితులను పోలీస్ స్టేషన్ నుంచి ప్రభుత్వ ఆసుపత్రి వరకు సుమారు కిలోమీటర్ దూరం రోడ్డుపై నడిపించుకుని తీసుకువెళ్లారు. నిందితులు మద్యం మత్తులో ఈ ఘటనకు పాల్పడ్డారని స్థానికులు చెబుతు న్నారు. పోలీసులు సైతం వారి వద్ద కొంత సారా స్వాధీనం చేసుకున్నట్లు చెబుతున్నారు. మద్యం మత్తులో విచక్షణ మరిచి ప్రవర్తించిన వ్యక్తులకు పోలీసులు కౌన్సిలింగ్ ఇవ్వడం ద్వారా వారి ప్రవర్తనలో పరివర్తన తీసుకొచ్చే ప్రయత్నం చేయవచ్చు. చట్ట ప్రకారం నిందితులను అరెస్ట్ చేయడంలో తప్పు లేదు. దళిత సామాజిక వర్గానికి చెందిన యువకులను అవమానపరిచే విధంగా నడిరోడ్డులో నడిపించారు. దీనిపై వైసిపి శ్రేణులు మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్లు చెబుతున్నారు. రాష్ట్రంలో ఇటువంటి ఘటనలపై పోలీసుల భిన్న వైఖరి పట్ల కోర్టులో సవాల్ చేసేందుకు వైసిపి సన్నద్ధం అవుతున్నట్లు చెబుతున్నారు. నిందితులను నడిపిస్తున్న సమయంలో కాళ్లు నేలపై ఆన్చడానికి సైతం ఇబ్బంది పడిన దశ్యాలు మీడియా వీడియోల్లో స్పష్టంగా కనిపించాయి. నిందితులను కొట్టారని వైసీపీ వాదిస్తుంది.నింది తులను కొట్టిన పోలీసులను కోర్టు ముందు దోషులుగా నిలబెడతామని వైసీపీ నేతలు స్పష్టం చేస్తున్నారు. చోడవరం నిందితులో అరెస్టు వ్యవ హారంలో ఒక పోలీస్ అధికారి వైఖరిపై వైసిపి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఘాటైన విమర్శలు సంధించారు.

సోషల్ మీడియా పోస్టులపై స్పందిస్తారా....

చోడవరంలో ఘటనపై సోషల్ మీడియాలో వచ్చిన పోస్టులను ఆధారంగా చేసు కుని పోలీసులు అరెస్టులకు దిగారు. మరి ఇప్పు డు టిడిపి శ్రేణులు సోషల్ మీడియాలో పెడుతున్న వీడియో పోస్టింగులపై పోలీస్ యంత్రాంగం ఎలా స్పంది స్తుందనేది ఆసక్తి కరంగా మారింది. చోడవ రంలో అరెస్టైన నిందితులను నడిపించుకుంటూ తీసుకువెళుతున్న వీడియోలను పెట్టి వైసీపీకి మద్దిపాటి వెంకటరాజు ఇదే మాస్ వార్నింగ్ అంటూ పోస్టులు పెడుతున్నారు. మరోవైపు తామేమీ తక్కువ కాదనట్టు వైసిపి శ్రేణులు పోటీగా పోస్టులు పెడుతున్నాయి. చోడవరం అరెస్టుల వ్యవహారంపై హెూంమంత్రి అనిత మాట్లాడిన వీడియో కింద అనంతపురంలో టిడిపి శ్రేణులు కత్తులు పట్టుకుని పొట్టేళ్లను నరుకుతున్న వీడియోలను పోస్ట్ చేస్తున్నారు. హోంమంత్రికి, పోలీసులకు ఇవి కనిపించవా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇరు పార్టీల మధ్య ఈ వివాదంపై సోషల్ మీడియాలో పెద్ద వార్ నడుస్తుంది.చోడవరం సోషల్ మీడియా పోస్ట్‌పై శరవేగంగా స్పందించిన పోలీసులు ఇప్పుడు సోషల్ మీడియా లో వస్తున్న కామెంట్స్ పై ఎలా స్పందిస్తారో.... వేచి చూడాల్సిందే.

నిబంధనలు పాటించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

న్యూ ఇయర్ సందర్భంగా డిసెంబర్ 31 రాత్రి పోలీసులు సూచించిన నిబంధనలను తప్పక పాటించాలని ఎస్‌పి నరసింహకిశోర్ స్పష్టం చేశారు. నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ప్రశాంతంగా, సురక్షితంగా జరుపుకోవడానికి బందోబస్తు ఏర్పాట్లను, డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయం ముగిసిన వెంటనే మద్యం షాపులు, బార్లు, రెస్టారెంట్లను మూసివేయాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం భారీ జరిమానాలతో పాటు, వారం రోజుల వరకు జైలు శిక్ష కూడా విధిస్తారన్నారు. బైకులపై విన్యాసాలు, రేసింగ్‌లు వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ర్యాష్ డ్రైవింగ్, జిగ్ జాగ్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో కేక్ కటింగ్‌లు, మందు గుండు సామాగ్రి కాల్పులు పూర్తిగా నిషేదమన్నారు. అర్ధరాత్రి 1:30 గంటల తర్వాత రోడ్లపై ఎటువంటి సరైన కారణం లేకుండా తిరగరాదన్నారు. న్యూ ఇయర్ వేడుకల్లో ఈవెంట్‌ల వద్ద సీసీటీవీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాన్నారు. బహిరంగ ప్రదేశాల్లో నిర్వహించే వేడుకల్లో సౌండ్ సిస్టమ్‌లు, లౌడ్ స్పీకర్ల వినియోగం నిషేధమన్నారు. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టి శక్తి టీం బందాలను మఫ్టీలో రంగంలోకి దింపనున్నట్లు తెలిపారు. అన్ని ప్రధాన రహదారులు, ముఖ్యమైన జంక్షన్ల వద్ద పికెట్‌లు, చెక్‌పోస్టులు" ఏర్పాటు చేస్తామన్నారు. వేడుకల ముసుగులో జూదాలు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు.

ఎంపిపి తక్షణమే రాజీనామా చేయాలి

ప్రజాశక్తి-గోపాలపురం

విలేకర్ల సమావేశంలో పాల్గొన్న వైసిపి నాయకులు

పార్టీ పేరుతో గెలుపొంది పదవులు అనుభవిస్తూ స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీకి వెన్నుపోటు పొడిచిన ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, ఉప సర్పంచ్ వింత ప్రసాద్‌రెడ్డి పదవులకు తక్షణమే రాజీనామా చేయాలని వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. గోపాలపురం వైసిపి కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వైసిపి నియోజకవర్గ గ్రీవెన్స్ అధ్యక్షులు కురుకూరి నాగేశ్వరరావు, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు సాలి వేణు, పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ పోతిరెడ్డి నాగరాజు, మండల నాయకులు మాట్లాడారు. వైసిపి పేరు చెప్పుకుని ఏడేళ్ల సొసైటీ అధ్యక్షునిగా, అదే జగన్ పేరు చెప్పుకుని ఎంపిటిసిగా గెలిచి మూడేళ్ల పాటు ఎంపిపి పదవిని అనుభవించావనానరు. స్వార్థ ప్రయోజనాల కోసం తల్లిలాంటి పార్టీకి ద్రోహం చేయటం సిగ్గుచేటన్నారు. ఉప సర్పంచ్ వింత ప్రసాద్ రెడ్డి, ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ పదవిలో ఉండగా కాంట్రాక్టులు చేసుకుంటు, చెరువులు తవ్వి మట్టి వ్యాపారాలు చేస్తూ లక్షలాది రూపాయిలు సొమ్ము చేసుకున్నారన్నారు. నమ్ముకున్న కార్యకర్తలకు ద్రోహం చేశారని విమర్శించారు. డప్పు కొట్టుకుంటున్న విధంగా రాజీనామ చేసింది 50 మంది కాదని, కేవలం 15 మంది లోపు మాత్రమే ఉంటారని తెలిపారు. 18 మంది ఎంపిటిసిలు నిలబెడితేనే ఎంపిపి అయ్యావనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. ఆత్మాభిమానం కుంటే పదవులకు రాజీనామా చేసి, బలాన్ని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షులు వెలగ శ్రీరామ్మూర్తి, పిన్నమనెని చిన్నబాబు, వల్లభని సత్యనారాయణ, కూసం రామ్మోహన్ రెడ్డి, బొమ్మ మురళి, బొమ్మిన నాగరాజు, అన్సర్ బాషా, శ్యాం సుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటితో ఆర్‌టిసి బస్సు డ్రైవర్లకు శిక్షణ పూర్తి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

నవంబర్ 28న ప్రారంభమైన ఆర్‌టిసి బస్సు డ్రైవర్ల శిక్షణా తరగతులు గురువారంతో పూర్తి కానున్నాయి. నవంబర్ 28న రాజమహేంద్రవరం జోనల్ ట్రైనింగ్ కాలేజీలో హైర్ బస్ డ్రైవర్స్, ఆన్ కాల్ డ్రైవర్లకు ఉదయం 9 గంటల నుంచి ప్రమాద రహిత డ్రైవింగ్ శిక్షణ తరగతులను తూర్పుగోదావరి జిల్లా రవాణా అధికారి వైఎస్ఎన్.మూర్తి ప్రారంభించారు. 28న ప్రారంభమైన ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని 16 డిపోల నుంచి మొత్తం 1,050 డ్రైవర్లకు శిక్షణ అందించారు. ఆర్‌టిసి, ట్రాఫిక్ పోలీస్, రవాణా అధికారులు ఈ శిక్షణ అందించారు. మంగళవారం జిల్లా ప్రజా రవాణా అధికారి వైఎస్ఎన్.మూర్తి, ఎంవిఐ రవికుమార్, ఎంవిఐ సంపత్‌కుమార్ శిక్షణ ఇచ్చారు. అనంతరం రవికుమార్, సంపత్ కుమార్‌లను సత్కరించారు. తదుపరి రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.32 మంది రక్తదానంచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి సీనియర్ మెడికల్ ఆఫీసర్ ప్రసూనాంబ తదితరులు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని అన్నవరప్పాడులో పింఛన్ల పంపిణీ జరుగుతుందని, ఈ కార్యక్రమానికి మంత్రి కందుల దుర్గేష్ హాజరవుతారని గ్రామ జనసేన అధ్యక్షుడు పొప్పొపు వెంకట నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు పొప్పొపు సూర్యనాగేశ్వరరావు తెలిపారు. పింఛను లబ్ధిదారులు అందుబాటులో ఉండాలన్నారు

జెవివి ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ అవేర్నెస్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

ఆర్‌ఐఒకు కరపత్రాలను అందజేస్తున్న జెవివి నాయకులు

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ అవేర్నెస్ ప్రోగ్రామ్‌ను మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, ఎస్‌కెవిటి డిగ్రీ కళాశాల, ఆదిత్య డిగ్రీ కళాశాల, సంహిత డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల తదితర కళాశాలలలో మాదక ద్రవ్యాలు వినియోగం వల్ల జరిగే నష్టాలను వివరిస్తూ కరపత్రాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.రవిబాబు మాట్లాడారు. భావిభారత పౌరులను గంజాయి, మద్యం తదితర డ్రగ్స్ నుంచి కాపాడుకోవాలని ఈ అవేర్నెస్ క్యాంపెయిన్ రాష్ట్ర వ్యాప్తంగా జెవివి నిర్వహిస్తుందని తెలిపారు. మాదకద్రవ్యాలు యువతలో తన, మన అనే విచక్షణ లేకుండా సహనాన్ని కోల్పోయేలా చేసి, సంఘ విద్రోహులుగా మారుస్తున్నాయన్నారు. గతంలో చాటుగా జరిగిన గంజాయి ప్రయాణం నేడు రోడ్లపై వీర విహారం చేస్తూ అభం శుభం తెలియని పిల్లల్ని సైతం బలికుంటుందన్నారు. గంజాయిలో టెట్రా హెడ్రా కెనాబినైడ్ అని రసాయనం ఉంటుందని, అది మెదడులో డోపమైన్, సెరటోనిన్ అనే ఉత్ప్రేరకాలను విడుదల చేస్తుందన్నారు. వీటివల్ల మెదడు వేగంగా స్పందించి శరీరాన్ని ఉత్తేజ కరంగా ఉండేటట్లు కొద్దిసేపు చేస్తుందన్నారు. అటువంటి వారి లక్షణాలను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు త్వరితగతిన గుర్తించి కౌన్సెలింగ్ నిర్వహించాలని, ప్రభుత్వం పాఠశాలలు, కళాశాల పరిసరాల్లో గంజాయి విక్రయాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మత్తు పదార్థాల వల్ల జరిగే దుష్పరిణామాలు వివరిస్తూ అవగాహన క్యాంపులను కూడా నిర్వహించాలని కోరారు. అధ్యక్షులు కె.భీమయ్య మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలను మంచి నూతన నిర్ణయాలతో ప్రారంభించుకోవాలని మద్యం, గంజాయి తదితర దుర్వ్యసనాలకు దూరంగా వేడుకలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కె.భీమయ్య, ప్రధాన కార్యదర్శి ఎన్.రవిబాబు, కార్యదర్శి బిఎస్‌వివి.ప్రసాదరావు, పైడియ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల నిర్వహణ అభినందనీయం

ప్రజాశక్తి- గోపాలపురం

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంఎల్‌ఎ మద్దిపాటి, మధుకృష్ణ

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కొన్నేళ్లుగా వేళ్లచింతలగూడెం గ్రామంలో పార్టీలకు అతీతంగా క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు అన్నారు. మంగళవారం మండలంలోని వేళ్లచింతలగూడెంలో ఆర్‌అండ్ ఫౌండేషన్, ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు సౌజన్యంతో సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్న క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంక్రాంతి పండుగలను పురస్కరించుకొని యువత జూదాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. సంప్రదాయ క్రీడల వైపు మొగ్గు చూపాలన్నారు. సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. 30 టీముల పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతిగా రూ.లక్ష, రెండవ బహుమతిగా రూ.75వేలు, మూడవ బహుమతిగా రూ.50 అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంక్రాంతి సంబరాలు కమిటీ పెద్దలు, ఆర్ అండ్ ఫౌండేషన్ చైర్మన్ గంటా మధుకృష్ణ, కొర్లపాటి రాము, పిన్నమనేని చినబాబు, ఇల్లూరి రాంబాబు, కొర్లపాటి అన్నవరం, పరిమి జగదీష్, గన్నిన మురళి, ముత్యాల రాయుడు, డి.సత్యనారాయణ, జ్యేష్ట శ్రీధర్ , బుర్రెడ్డి వాసు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి సర్కారు కృషి

ప్రజాశక్తి - గోపాలపురం

ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు అన్నారు. ఎపిటిఎఫ్ నూతన సంవత్సరం క్యాలెండర్లు, డైరీలను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఎపిటిఎఫ్ సభ్యులు డైరీ, క్యాలెండర్, జిఒ పుస్తకాన్ని ఆయనకు అందజేశారు. ఉద్యోగ ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి. జిల్లా కార్యవర్గ సభ్యులు పులపాకుల గంగరాజు, సనపల రాజశేఖర్, దేవరపల్లి, మండల కార్యవర్గ సభ్యులు మానేపల్లి గణేష్‌నాథ్, నీరుకొండ సాయిబాబా, బోడా వెంకటలక్ష్మి, రాపాక బాబూరావు, నీలపాల నాగదుర్గారావు, కాగితపు శ్రీనివాస్, సిఆర్‌పి కొయ్య నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పతాకావిష్కరణలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు, సిఐటియు అధ్యక్షుడు సుందర్‌బాబు

సిఐటియు మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - కొవ్వూరు

సిఐటియు 18వ అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.సుందర్‌బాబు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు పతాకాన్ని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు అల్లం వెంకటలక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుందర్‌బాబు మాట్లాడారు. ఈ నెల 31 నుంచి జనవరి 4వరకూ విశాఖలో ఈ మహాసభ జరుగుతుందన్నారు.దేశంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో కార్మికులు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభలో చర్చిస్తారన్నారు. నాలుగవ తేదీన భారీ బహిరంగ సభ జరుగుతుందని, కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రెడ్డి వెంకటరమణ, కళ్యాణి, పద్మ పాల్గొన్నారు.

ఐజక్ న్యూటన్‌కు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలుకు చెందిన విద్యావేత్త, సామాజిక వేత్త డాక్టర్ విప్పర్తి ఐజక్ న్యూటన్ పండుకు రాజమహేంద్రవరంలోని ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు మెమోరియల్ ట్రస్ట్ వారి లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు దక్కింది. మూడు దశాబ్దాలుగా ఆయన చేస్తున్న సామాజిక సేవలకు గుర్తింపుగా ఆయనకు ఈ పురస్కారం దక్కింది. విజయవాడ గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా ఫౌండర్, అధ్యక్షుడు కె.కృష్ణమూర్తి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నట్లు న్యూటన్ తెలిపారు. ఈ సందర్భంగా న్యూటన్ మాట్లాడారు ఇప్పటివరకు 69 అవార్డులు అందులో 8 లైఫ్ టైమ్ అవార్డులు వచ్చాయన్నారు. ఈ అవార్డు రావడం పట్ల విప్పర్తి స్వర్ణ కుమారి, ఆశీర్వాదకుమారి, కృపా సరోజ్‌బాబు, ప్రియదర్శిని, గీత, దేవసహాయం, చెరుకూరి పద్మ, బుజ్జమ్మ తదితరులు అభినందించారు.



రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

ప్రజాశక్తి-గోపాలపురం

రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ పివి.సాంబశివరావు తెలిపారు. మంగళవారం మండలంలోని వేళ్లచింతలగూడెం గ్రామంలో రీ సర్వే ఫేస్-4 లో భాగంగా రీసర్వేపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ రైతుల సమక్షంలో అత్యాధునిక టెక్నాలజీతో భూములను సర్వే చేసి కచ్చితమైన సరిహద్దులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం రీసర్వే ప్రాముఖ్యత, ఉపయోగాలు తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రంలో సర్పంచ్ గోళ్ల కుమార్, గ్రామ నాయకులు, రైతులు కొర్లపాటి రాము, రాంబాబు, పరిమి జగదీష్, కె.అన్నవరం, విఆర్ఒ కాంతారావు, గ్రామ సర్వేయరులు, మహాలక్ష్మి, కిషోర్, ప్రతాప్, లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో ఒప్పందం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరంలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మధ్య మంగళవారం కలెక్టరేట్‌లో అవగాహన ఒప్పందం జరిగింది. కలెక్టర్ కీర్తి చేకూరి, జెసి, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ డైరెక్టర్ వై.మేఘస్వరూప్ ఆధ్వర్యంలో ఈ అవాగాహనా ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ద్వారా ఆవిష్కరణలు, ఔత్సాహిక వ్యాపారాలు, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమ-విద్యా సంస్థల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఈ భాగస్వామ్యం ద్వారా విద్యార్థులు, అధ్యాపకులకు ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, పరిశ్రమ అనుభవం, పరిశోధన, సామర్థ్యాభివృద్ధి వంటి విస్తృత అవకాశాలు అందుబాటులోకి రానున్నాయని జెసి తెలిపారు. ఈ కార్యక్రమంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ నోడల్ అధికారి టివి.సూర్యప్రకాశ్, ఇంక్యుబేటర్ హెడ్ కె.చంద్రశేఖర్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్రరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఊనగట్ల విద్యార్థులు

ప్రజాశక్తి-చాగల్లు

మండలంలోని ఊనగట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం ఎన్వి.రమణ తెలిపారు. సోమవారం రాజమహేంద్రవరంలోని ఎస్‌కెవిటి డిగ్రీ కళాశాలలో జరిగిన మహిళలు కబడ్డీ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారన్నారు. పదో తరగతి విద్యార్థిని దొంగ పవిత్ర, 9వ తరగతి విద్యార్థిని కాసాని రాఘవి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. జనవరి 2 నుంచి 5 వరకు పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరంల్లో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయులు కొయ్య గంగాధరరావును, విద్యార్థిలను పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు నందిగం శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షులు బొల్లిన శివనాగేంద్ర, ఎస్‌ఎంసి చైర్మన్ కామన శివ, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ఎంపికైన విద్యార్థినులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - సీతానగరం

నూతన సంవత్సర వేడుకల్లో నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కోరుకొండ సిఐ ఎస్‌వివిఎస్.మూర్తి హెచ్చరించారు. మంగళవారం కోరుకొండ సిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ వేడుకలను ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో సంతోషంగా జరుపు కోవాలన్నారు. వేడుకల పేరుతో బహిరంగ ప్రదేశాల్లో హంగామా చేస్తూ, ప్రజల శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేడుకల నేపథ్యంలో ముందస్తు భద్రతా ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే వాహనాలను సీజ్ చేయడమే కాకుండా, జైలుకు పంపుతామన్నారు. వారి డ్రైవింగ్ లైసెన్సులను శాశ్వతంగా రద్దు చేసేలా రవాణా శాఖకు సిఫార్సు చేస్తామన్నారు. రహదారులు, బహిరంగ ప్రదేశాల్లో కేక్ కటింగ్ చేయడం, డ్యాన్సులు వేయడం, రంగులు పూయడం వంటి చర్యలపై నిషేధం ఉందన్నారు. అనుమతి లేకుండా డిజెలు, లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేయరాదన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితి లేదా అవాంఛనీయ ఘటనలు జరిగితే వెంటనే 112కు సమాచారం ఇవ్వాలన్నారు.

వాడపల్లి దేవస్థానం చైర్మన్‌కు సత్కారం

ప్రజాశక్తి-కడియం

వాడపల్లి దేవస్థానం చైర్మన్‌గా నూతనంగా నియమితులైన ముదునూరి వెంకటరాజును, కడియపులంక సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రత్నం అయ్యప్ప ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు రత్నం అయ్యప్ప, ఉపాధ్యక్షులు బోడపాటి గోపి, జనరల్ సెక్రటరీ కొండేపూడి నాగు, సెక్రటరీ తడాల నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ గాజుల రత్తయ్య, ట్రెజరర్ రత్నం బాబ్జీ, జాయింట్ ట్రెజరర్ పిల్లా శ్రీనివాస్, డైరెక్టర్ గాద నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని మల్లిసాల శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై మంగళవారం ఎస్.రఘునాథరావు తన సిబ్బందితో దాడి చేసి 8 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.13,200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. సర్కిల్ పరిధిలో ఎక్కడైనా కోడిపందాలు, గుండాట, పేకాట, బొమ్మ బొరుసు, ఎత్తులాట, కోత బంతి వంటి జూద క్రీడలు నిర్వహిస్తే 94949 33233, 9440796529, 9440796508 నంబర్లకు 100 112 కు సమాచారం ఇవ్వాలని కోరారు.

దోచుకున్న సొత్తు రికవరీ

ప్రజాశక్తి-కడియం

వృద్ధురాలిని బెదిరించి చోరీ చేసిన వ్యక్తిని అరెస్టు చేసి సొత్తును రికవరీ చేశామని కడియం సిఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని మాధవరాయుడుపాలెం శివారు చైతన్య నగర్‌కు చెందిన శాంతమ్మ అనే 67 ఏళ్ల వద్ధురాలు ఈ నెల 25న శ్రీకాకుళం నుంచి బయలు దేరి రాత్రికి రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో దిగింది. అక్కడ నుంచి చైతన్య నగర్ స్వగృహం చేరేందుకు వేచి ఉంది. ఈ సమయంలో ఒక వ్యక్తి లిఫ్ట్ పేరుతో బైకు ఎక్కించుకున్నాడు. శాంతమ్మను ఇంటి దగ్గర దింపుతానని చెప్పి మార్గ మధ్యలో ఆమెను కత్తితో బెదిరించి చెవికున్న బంగారపు చెవి దిద్దులు, రూ.5వేల నగదు అపహరించి పారిపోయాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. మేరకు ఎస్ఐ దుర్గాప్రసాద్ కేసు దర్యాప్తు చేశారు. నిందితుని పట్టుకుని సొత్తును రికవరీ చేశారు.

విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

విద్యార్థులకు తల్లితండ్రులు బలమైన పౌష్టికాహారాన్ని అందించాలని రాజపూడి పిహెచ్‌సి వైద్యులు ఎన్.పూజ సూచించారు. మంగళవారం స్థానిక శ్రీ ప్రజ్ఞ విద్యా సంస్థల ఆవరణంలో ఛైర్మన్ బండారు నాగబాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు వైద్య, కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు అందించాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. విద్యా సంస్థల ఛైర్మన్ నాగబాబు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం విద్యా సంస్థల్లో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ తుమ్మల శ్వేత, వైద్య సిబ్బంది, కాలేజ్ ప్రిన్సిపల్ కె.అభి, హై స్కూల్ ప్రిన్సిపల్ అడపా సాయిదీప్తి, ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్ టి.నాగలక్ష్మీ, ఇన్‌ఛార్జ్ కొల్లా శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు సామర్లకోట కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - సామర్లకోట

మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాలులో ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు. గత రెండు నెలలుగా ఛైర్‌పర్సన్ పై అవిశ్వాస తీర్మానం పెట్టడం, అమలు కాకపోవడం వంటి అంశాలు నేపథ్యంలో వైసిపి కౌన్సిలర్లు హాజరు కాకపోవడంతో వరుసగా సమావేశాలు వాయిదా పడుతున్నాయి. వరుసగా మూడు సమావేశాలు జరగకపోతే కౌన్సిల్ రద్దు అయ్యే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. దీంతో రేపటి సమావేశాలకు వైసిపి సభ్యులు హాజరు అవుతారా? లేదా? అనే సందిగ్ధత నెలకొంది.

అన్నదానానికి విరాళాలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ర్యాలి జగన్మోహిని కేశవ, గోపాలస్వామి వార్ల ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు మంగళవారం దాతలు విరాళాలను అందజేశారు. రాజమహేంద్రవరానికి చెందిన బోడపల్లి వరలక్ష్మి రూ.25,116, అలాగే హైదరాబాద్ చెందిన చల్లా విజయ్‌కుమార్ శర్మ దంపతులు రూ.5, 116, నిడదవోలుకు చెందిన దూరుపూడి శ్రీనివాస్, నాగమణి దంపతులు రూ.10,116 విరాళాలను ఆలయి ఇఒ భాగవతుల వెంకటరమణమూర్తికి అందజేశారు. వీరికి ఆలయ మర్యాదలతో స్వామివారి దర్శనం చేయించారు. వీకికి తీర్థ ప్రసాదాలతో పాటు వేద పండితులచే ఆశీర్వచనం చేయించి శ్రీ స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించారు.

సూక్ష్మ జీవశాస్త్రంలో పరిశోధనలు అవసరం

ప్రజాశక్తి - కాకినాడ

సూక్ష్మ జీవశాస్త్రంలో మరిన్ని పరిశోదనలు జరగాల్సిన అవసరం ఉందని ఆదిత్య డిగ్రీ, పిజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు అన్నారు. గత నాలుగు రోజులుగా ఆదిత్య డిగ్రీ కళాశాల సూక్ష్మజీవ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు, వ్యాసరచన, పవర్ పాయింట్ ప్రజెంటేషన్, పోస్ట్ ప్రెజెంటేషన్ వంటి అంశాలలో పోటీలను నిర్వహించారు. మంగళవారం ఆయా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి వైద్యరంగంలో సూక్ష్మజీవ శాస్త్రం యొక్క ప్రాధాన్యత చాలా ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన మైక్రో బయాలజీ విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, అధ్యాపకులు వి.అనిల్, డి.మాధవి రత్నప్రియ, సుభాషిణి విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్ జైలును సందర్శించిన న్యాయమూర్తి

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక సబ్ జైలును 7వ అదనపు జిల్లా జడ్జి జి.చంద్రమౌళీశ్వరి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ముద్దాయిలతో మాట్లాడి వారి యోగ, క్షేమాలతోపాటు, వారికి అందజేస్తున్న భోజనం, మంచినీరు, ఇతర వసతి సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.శ్రీరమణి, డిఎస్‌పి శ్రీహరిరాజు, సబ్ జైలు సూపరింటెండెంట్ రమణబాబు, న్యాయవాది కె.ప్రభూజి, వాలంటీర్ కె.జ్యోతి పాల్గొన్నారు.

కొబ్బరి పరిశ్రమల స్థాపనతో ఆర్థికాభివృద్ధి

కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

ప్రజాశక్తి - అమలాపురం

కొబ్బరి ఆధారిత పరిశ్రమల స్థాపన చేయడం ద్వారా స్థానిక ఆర్థికాభివృద్ధికి విశేష అవకాశాలు ఉన్నాయని కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ వెల్లడించారు. మంగళ వారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లాలో కొబ్బరి కామన్ ఫెసిలిటీ సెంటర్ ఇంక్యుబేషన్ సెంటర్ అభివృద్ధి, కొబ్బరి నుంచి వర్జిన్ కోకోనట్ ఆయిల్, కొబ్బరి డొక్క నుంచి ఫైబర్ యార్న్ కోకో ఫిట్ జియో టెక్స్టైల్ మాక్స్ తయారీ అంశాలపై ఎమ్ఎస్ఎంఇ ప్రోగ్రాం అభినవ్ కన్సల్టెంట్ మేనేజ్మెంట్ సర్వీసెస్ అజిత్ మిథాయిలతో సమీక్షిం చారు. కలెక్టర్ మాట్లాడుతూ స్థానికంగా కేవలం కొబ్బరి కాయలను రైతులు విక్ర యించి మిగిలిన క్వాయర్ విలువ ఆధారిత ఉత్పత్తు లపై ఏ విధమైన ఆసక్తి చూపక నష్టపోతున్నారని అన్నారు. దీనిని అధిగమించేందుకై ఎపిఐఐసి, జిల్లా పరిశ్రమల కేంద్రం, ఎన్ఆర్ఎల్ఎం ,నాబార్డు తదితర సంస్థల ద్వారా కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమ లు స్థాపనకు సమగ్ర ప్రతిపా దనలు రూపొందిస్తే ఉప్పలగుప్తం మామిడికుదురు మండలంలో స్థలాలు ప్రతిపాదించినట్లు తెలిపారు. ఉప్పలగుప్తంలో ఏడు ఎకరాల స్థలాన్ని ఈ యొక్క పరిశ్రమల ఏర్పాటుకై కేటాయించామన్నారు. ఎమ్ఎస్ఎమ్ఇ ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ద్వారా కొబ్బరి ఆధారిత ఉత్పత్తులు కొబ్బరి నూనె, కొబ్బరి ఉత్పత్తులు, కొబ్బరి షెల్ ఆధారిత వస్తువులు, ఫైబర్ ఇతర విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి అనుకూల వాతా వరణం ఏర్పడుతోందన్నా రు. దీని వల్ల మహిళా స్వయం సహాయక సంఘాలు, యువ ఔత్సాహిక పారి శ్రామికవేత్తలు స్వయం ఉపాధి మార్గాలను సులభంగా చేరుకునేలా సౌకర్యవంతం చేయాలన్నారు.ఈ కాంప్లెక్స ద్వారా అవసరమైన మౌలిక వసతులు మిషనరీ, శిక్షణ, మార్కెటింగ్ సహాయం, రాయితీతో కూడిన ఆర్థిక ప్రోత్సాహకాలు అందుబా టులోకి తెచ్చేం దుకు మార్గ నిర్దేశం చేయాలన్నారు. స్థానిక వనరులను సమ ర్థవంతంగా వినియోగిస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంపొందించ డమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. కోనసీమ ప్రాంతంలోని మహిళలు, యువత ఈ అవకాశాలను సద్విని యోగం చేసుకొని ఔత్సా హిక పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని, జిల్లా పరిపాలన విభాగం ప్రతి అడుగులో సహకరిస్తుందన్నారు. ఈ ప్రయత్నం కోనసీమను విలువ ఆధారిత పరిశ్రమల కేంద్రంగా తీర్చిదిద్దగలరని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆ దిశగా అవిశ్రాం తంగా ప్రయత్నాలు చేసి కేరళ, తమిళనాడు తరహా విలువ ఆధారిత కొబ్బరి ఉత్పత్తులు తయారీకై ఒకే జిల్లా ఒకే ఉత్పత్తి ప్రతి ఇంటి నుండి పారిశ్రామి కవేత్త తయారీ కావాలన్నా నానుడికి అను గుణంగా మహిళలు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ముందడుగు వేయాలన్నారు .కొబ్బరి కామన్ ఫెసిలిటేషన్ సెంటర్ లేదా ఇంక్యుబేషన్ సెంటర్‌ను అభివృద్ధి చేయడం వల్ల కోనసీమ జిల్లాలోని రైతులకు, మహిళా సంఘాలకు విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీలో అదనపు ఆదాయాన్ని ఆర్జించవ చ్చున్నారు. ఈ ప్రాంతానికి అనువైన యూనిట్లు నెల కొల్పేందుకు సమగ్రమైన ప్రతిపాదనలు రూపొందించి 20 రోజులలో మరలా సమావేశానికి రావాలని ఆయన కొబ్బరి విలువ ఆధారిత పారిశ్రామిక నిపుణులకు ఎంఎస్ఎంఇ ప్రోగ్రాం అధికారికి సూచిం చారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి దిలీప్ తదితరులు పాల్గొ న్నారు.

నూతన ఎస్‌బిఐ బ్రాంచ్‌ను ప్రారంభించిన కలెక్టర్

స్థానిక మోబెర్లీపేట టయోటా షోరూం ఎదురుగా ఇండియన్ బ్యాంకు రెండవ బ్రాంచ్‌ని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాంచ్ వల్ల ఖాతాదారులు తమ రోజువారీ బ్యాంకింగ్ అవసరాలను సులభంగా, వేగంగా నిర్వహించుకునే అవకాశం లభిస్తుందన్నారు. బ్యాంకు బ్రాంచీలు సమీపం లో ఉండడం వల్ల నగదు లావాదేవీలు, ఖాతాల నిర్వహణ, రుణాలు, డిపాజిట్లు, పెన్షన్, ప్రభుత్వ పథకాల లబ్ధి నేరుగా పొందడం సులభమవుతుందన్నారు. ముఖ్యంగా బ్యాంకు రుణంతో ముడిపడి ఉన్న ప్రభుత్వ పథకాలు మంజూరులో బ్యాంకులు కీలకపాత్ర పోషించాలని సూచించారు. సమాజాభి వృద్ధిలో బ్యాంకుల కీలక భూమిక పోషించాలని ఆయన స్పష్టం చేశారు ముఖ్యంగా రైతులు, చిన్న వ్యాపారులు, మహిళా స్వయం సహాయక సంఘాల వృద్ధులు దూరప్రయాణాలు చేయాల్సిన అవసరం లేకుండా సేవలను వినియోగించు కోగలుగుతారన్నారు. డిజిటల్ లావాదేవీ లపై అవగాహన పెరగడం, ఆర్థిక సాక్షరత మెరుగు పడడం ద్వారా ప్రజలు ఆర్థికంగా మరింత బలప డతారన్నారు. ఎల్‌డి

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

ఎం.కేశవ వర్మ ప్రసంగిస్తూ బ్యాంకింగ్ వ్యవస్థ విస్తరణతో పారదర్శకత పెరిగి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో లబ్ధి దారులకు అందుతాయ న్నారు. బ్యాంకు బ్రాంచీల ఏర్పాటు స్థానిక ఆర్థికాభివృద్ధికి దోహదపడుతూ, ప్రజలకు భద్రమైన విశ్వసనీ య ఆర్థిక సేవలను అందిం చడంలో కీలక పాత్ర పోషిస్తా యన్నారు. బ్యాంకు బ్రాంచీల సంఖ్య పెరగడం వల్ల గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ఆర్థిక చేరిక మెరుగవుతుందని. ఇది పేదరిక నిర్మూలనకు, వ్యవసాయ రుణాల అందుబాటుకు సహా యపడుతుందన్నారు. రైతులు, చిన్న వ్యాపారులకు ప్రత్యక్ష లాభాలు చేకూర్చుతుందన్నారు. బ్యాంక్ మేనేజర్ మోతి లాల్ ప్రసంగిస్తూబ్రాంచీల విస్తరణ గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్‌సేవలు అందుబాటులోకి తీసుకువస్తుందన్నారు, జన్‌ధన్ యోజన వంటి పథకాల అమలుకు సహకరిస్తుందన్నారు. ఇది డిపాజిట్లు, రుణాలు సులభంగా అందేలా చేస్తుందన్నారుగ్రామీణ అభివృద్ధివ్యవసాయ రంగానికి ప్రాధాన్యత రుణాలు పెరిగి, రైతులు ఆధునిక పద్ధతులు అవలంబించగలుగుతారన్నారు ఉత్పత్తి పెరుగుదలకు, పేదరిక తగ్గించడానికి దోహదపడుతుందన్నారు. ఉపాధి సృష్టి బ్రాంచీల ఏర్పాటు స్థానిక ఉద్యోగా లు, పరోక్ష ఉపాధి అవకా శాలు పెంచుతుందన్నారు. వివిధ పరిశ్రమలకు రుణాలు అందుతూ చిన్న వ్యాపారాలు పెరిగి స్థానిక ఆర్థిక వ్యవస్థ బలపడుతుందన్నారు. మహిళలు, బలహీన వర్గాలకు ఆర్థిక సాధికారత పెరుగుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిత్యవసర వస్తువుల పంపిణీ

అగ్ని ప్రమాద బాధితులకు రెడ్ క్రాస్ సాయం

ప్రజాశక్తి - కాట్రేనికోన

కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశాల మేరకు ఇటీవల అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన జగడం నానిబాబు కుటుంబానికి రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, టార్పాలిన్, వంట సాయగ్రిని అందించారు. ఈ సందర్భంగా సంస్థ మాజీ ఛైర్మన్ కోరుకొండ సత్యనారాయణ(ఢిల్లీ నారాయణ) మాట్లాడుతూ బాధిత కుటుంబానికి తాము అండగా ఉంటామన్నారు. జరిగిన నష్టాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లి తగిన న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యుడు నేల కిషోర్, సర్పంచ్ గంటి వెంకట సుధాకర్, నల్లా నరసింహమూర్తి, రేవు రమేష్, పెయ్యల చిట్టిబాబు, కోలాటి సత్యం, చిల్లా కృష్ణ, బీర వరదరాజు, కాండ్రేగుల వెంకటేశ్వరరావు, వస్కా గోవిందరాజులు , ఆర్ ఐ విశ్వనాధ్, విఆర్ఒ సుష్మ, అంగన్‌వాడీ వర్కర్ రేవు చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పోటీల్లో ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థినులు

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - రాజోలు

రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా సంస్కార భారతి ఆధ్వర్యంలో మంగళవారం రాజోలు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాజ్యాంగం పట్ల అవగాహన కోసం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తాటిపాక హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. సంస్కార భారతి కోనసీమ అధ్యక్షులు కూచిమంచి కృష్ణ మాట్లాడుతూ భారత రాజ్యాంగం సామాజిక, ఆర్థిక న్యాయాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా సంస్కార భారతి కార్యదర్శి, ప్రముఖ న్యాయవాది మైలవరపు శ్రీదేవి మాట్లాడుతూ భారత రాజ్యాంగం 1949 నవంబర్ 26 న అమలులోకి, 1950 జనవరి 26 ఆమోదంలోకి వచ్చిందని అన్నారు. విద్యార్థులు దేశభక్తిని కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు ఎన్. మనోహరం, టిఎస్‌కెడి.ప్రసాద్‌రావు, సంస్కార భారతి ప్రధాన కార్యదర్శి వలవల వెంకట రెడ్డి నాయుడు, రాష్ట్ర మహిళా సంయోజన వేదనపట్ల సాయి లక్ష్మీ, తాటిపాక హైస్కూల్ సాంఘిక శాస్త్ర అధ్యాపకుడు మానేపల్లి లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

దేవస్థానం పాలక మండలి ప్రమాణ స్వీకారం

దేవస్థానం పాలక మండలి ఛైర్మన్‌గా శివకుమార్

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నగరపంచాయతీ పరిధిలోని ఉమా సురేశ్వర స్వామి దేవస్థానం పాలక మండలి ఛైర్మన్ గా జంధ్యాలా సాంబ శివ కుమార్ మంగళ వారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ ప్రాంగణంలో ఎంపీ హరీష్ మాదుర్, ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజుల సమక్షంలో పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం జరిగింది. ఛైర్మన్‌గా శివకుమార్, ధర్మకర్తలుగా మట్టపర్తి రజిని కుమారి, దువ్వూరి లక్ష్మి, జనిపల్లి సత్యనారాయణ, ర్యాలీ నాగేంద్ర బాబు, వేములవలస అప్పారావు, అన్నాబత్తుల భాను, విధులూరి ఉదయ కృప, శీలం శ్రీనివాసరావు, ఎక్స ఆఫిషియో సభ్యునిగా కొత్తలంక సూర్య వీరభద్రరాజుతో ప్రమాణ స్వీకారం చేశారు. ఎంపి హరీష్ ఎంఎల్‌ఎ సుబ్బరాజు మాట్లాడుతూ, ఆలయ సంప్రదాయాలను కాపాడుతూ, యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా పాలక మండలి పనిచేయాలని సూచించారు. ఆలయ అభివృద్ధికి నూతన ట్రస్ట్ బోర్డు కృషి చేయాలన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌టియు డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆలమూరు

ఎస్‌టియు ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సరం 2026 డైరీ, క్యాలెండర్‌ను ఎంఇఒ బి..అప్పాజీ కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడతూ ఉపాధ్యాయులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ ఉత్తమ సేవలు అందిస్తున్న ఎస్‌టియు ఆలమూరు మండల శాఖని అభినందించారు.కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు సలాది శ్రీనివాసు, ప్రధాన కార్యదర్శి వాసా నాగ వీర దుర్గాప్రసాద్, విద్యా భవన్ కన్వీనర్ కెఎస్ఎన్ మూర్తి, మహిళా కార్యదర్శి టి.బాల ఉమామహేశ్వరి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యాన బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - కాకినాడ

సిఐటియు అఖిలభారత మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ నగర సిఐటియు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మంగళవారం నగరంలోని భానుగుడి సెంటర్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా జగన్నాధపురం వంతెన నుంచి దేవాలయం మీదుగా కలెక్టరేట్ వరకూ ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఎపి ఎంఎస్ఆర్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.వెంకట్రావు, సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్.పద్మ మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్రంలో మొదటిసారిగా సిఐటియు అఖిలభారత మహాసభ విశాఖపట్నంలో నేటి నుంచి జనవరి 4వ తేదీ వరకూ జరుగుతుందన్నారు. ఈ మహాసభ ముగింపు సందర్భంగా జనవరి 4న జరిగే ప్రదర్శన, బహిరంగ సభలను కార్మికులు, ప్రజలు, వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు పాల్గొని జయప్రేదం చేయాలని పిలుపునిచ్చారు.పోరాటాల వేగుచుక్క సిఐటియు అఖిలభారత మహాసభలో భవిష్యత్తులో చేయబోయే పోరాటాలకు ఒక దిశా నిర్దేశం చేయడం జరుగుతుందన్నారు. లేబర్ కోడ్స్ ను వ్యతిరేకిస్తూ 2026 ఫిబ్రవరి 12వ తేదీన దేశవ్యాప్త సమ్మె చేయడానికి కార్మికులంతా సిద్ధపడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సత్తిరాజు, ఎపి ఎంఎస్ఆర్‌యు రాష్ట్ర కోశాధికారి డి.ప్రసాద్, సిఐటియు జిల్లా కోశాధికారి మలకా వెంకటరమణ, నగర కమిటీ సభ్యులు పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ, భారతీప్రియ, జి.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

'ముక్కోటి'కి కిటకిటలాడిన ఆలయాలు

వాడపల్లిలో గరుడవాహనంపై వెంకన్న

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో ముక్కోటి ఏకాదశి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాలు యాత్రికులతో పోటెత్తాయి.

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామిని మంగళవారం ఉత్తర ద్వారం ద్వారా యాత్రికులు, ప్రముఖులు దర్శించుకున్నారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాదుర్, ఎంఎల్ఎ బండారు సత్యానందరావు లు, ప్రజా పతినిధులు ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని స్వామి దర్శించుకున్నారు. సాయంత్రం గరుడ వాహనంపై వెంకటేశ్వర స్వామి ఆలయం మాడవీధులలో విహరించారు **రామచంద్రపురం:** ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుని ద్రాక్షారామంలో గల కాళేశ్వర ఘట్టంలో సుమారు 2000 మందికి అన్నదాన కార్యక్రమంలో నిర్వహించారు.భీమేశ్వర స్వామి వారి ఆలయం యాత్రికులతో కిటికిటలాడింది. కె.గంగవరం మండలంలోని కోటిపల్లి సోమేశ్వర స్వామి ఆలయానికి యాత్రికులు పోటెత్తారు. **ఆలమూరు:** శ్రీదేవి భూదేవి సమేత నవ జనార్ధన స్వామిని ఉ కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గంట స్వరూపారాణి, ఆంధ్రప్రదేశ్ గ్రయావలయ సంస్థ డైరెక్టర్ కట్నం విశాలి, శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ డైరెక్టర్ ఎ.అనిల్‌కుమార్ తదితరులు దర్శించుకున్నారు.

ఆత్రేయపురం: ర్యాలి జగన్మోహిని కేశవ, గోపాల స్వామి వారి ఆలయానికి ముక్కోటి ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని యాత్రికులు పోటెత్తారు. జిల్లా దేవదాయ ధర్మదాయ శాఖ సహాయ కమీషనరు స్వామివారిని దర్శించుకుని ఏర్పాట్లును పర్యవేక్షించారు.

మామిడికుదురు: అప్పనపల్లిశ్రీ బాలబాలాజీ స్వామిని ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ, నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ పెనుమాల లక్ష్మి, జెడ్‌పి మాజీ ఛైర్మన్ నామన రాంబాబు, నియోజకవర్గకో కన్వీనర్ డివివి. సత్యనారాయణ. మొల్లేటి శ్రీనివాస్, తదితర కూటమి నేతలు ఉత్తర ద్వారాదర్శనం చేసుకున్నారు. అర్చకులు వారికి వేదాశీర్వచనం నిర్వహించారు. వారి వెంట ఛైర్మన్ వంశపారంపర్య ధర్మకర్త మొల్లేటి లక్ష్మీ నారాయణ ఉన్నారు.

బాలబాలాజీ ఆదాయం రూ.5.19 లక్షలు

ముక్కోటి ఏకాదశి సందర్భంగా మంగళవారం 26,600 మంది భక్తులు ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారిని దర్శనం చేసుకున్నారు వివిధ విభాగాల ద్వారా రూ.5,19,621లు ఆదాయం సమకూరిందని ఆలయ సహాయ కమిషనర్ ఎం సత్యనారాయణ రాజు తెలిపారు తెలిపారు. ఇందులో అన్నదాన ప్రసాదం కి రూ.1,71,297లు. విరాళం వచ్చిందన్నారు.

అప్పనపల్లిలో ఎంఎల్ఎ గిడ్డి, కూటమి నేతలు

సమన్వయంతోనే సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నగర పంచాయతీ వైస్ ఛైర్మన్ వేటుకూరి బోసురాజు (సుభాష్ చంద్రబోస్) సూచించారు. కౌన్సిల్ హాలు నందు మంగళవారం బోసురాజు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. తొలుత 17 అంశాలతో అజెండాను, 5 అంశాలతో టేబుల్ అజెండాను ప్రవేశపెట్టి చర్చించారు. ఫ్లోర్ లీడర్ బాలకృష్ణ సిబ్బంది నిర్లక్ష్య వైఖరితో సమస్యల పరిష్కారం కావట్లేదని ఆరోపించారు. నగర పంచాయతీలో పలు వార్డుల్లో విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తగులుతున్నాయని, వాటిని తొలగించాలని చెప్పినా విద్యుత్ సిబ్బంది పట్టించుకోవడం లేదన్నారు. దీనివల్ల తరచూ వీధి దీపాలు కాలిపోతున్నాయని, ఆ చెట్లు తీగలపై పడితే విద్యుత్ స్తంభాలు కూడా ధ్వంసం అయ్యే పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎలక్ట్రికల్ ఎఇ శివశంకర్ స్పందిస్తు తక్షణమే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.9 వార్డులో ట్రాన్స్‌ఫార్మర్, ఐరన్ స్తంభాలు దెబ్బతిన్నాయని వాటి స్థానంలో కాంక్రీట్ దిమ్మలు ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ అడబాల సతీష్ కుమార్ కోరారు. సంక్రాంతి పండగ సందర్భంగా అన్ని వార్డులలోనూ ప్రత్యేక శానిటేషన్ నిర్వహించి దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే పండగ సమయంలో మంచినీటిని ఎక్కువ సమయం సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. 19 వార్డు కౌన్సిలర్ కడలి సౌజన్య టౌన్ ప్లానింగ్ విభాగం పని తీరు పై అసంతృప్తి వ్యక్తం చేశారు. 17వార్డు కౌన్సిలర్ బొంతు సత్య శ్రీనివాస్ టిపిఓ సెలవులో ఉన్నందున ఎల్ఆర్ఎస్, బిపిఎస్ స్కీమ్‌లో బిల్డింగ్ క్రమబద్ధీక రణకు ఫీజులు చెల్లించిన వారికి సకాలంలో ఆన్‌లైన్‌కాక పోతే క్రమబద్ధీకరణ జరగక నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. 13 వార్డు కౌన్సిలర్ వార్డులో తాగునిటీ సమస్య అధికంగా ఉందని, పరిష్కరానికి చర్యలు తీసుకోవాలన్నారు. అభివృద్ధి పనుల సమాచారాన్ని కౌన్సిల్ సభ్యులకు తెలియజేయకపోవడాన్ని 7వార్డు కౌన్సిలర్ గంజా శ్రీనివాస్ తప్పుబపట్టారు. కమిషనర్ రవివర్మ మాట్లాడుతూ అధికారులు ప్రజా ప్రతినిధులు పరస్పరం సమన్వయంతో పనిచేయాలని, శానిటేషన్ సమస్యను పరిష్కరించేందుకు సెగ్రిగేషన్ పాయింట్‌ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సెగ్రిగేషన్ పాయింట్ ద్వారా సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేసి ప్రాసె సింగ్ చేసిన వ్యర్థాల డంపింగ్ చేసేందుకు సేకరించిన 6 ఎకరాల స్థలం పరిసర ప్రాంత రైతులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో, వ్యర్థాలను కాకినాడ డంపింగ్ యార్డ్‌కు తరలించే విధంగా చర్యలు తీసుకున్నా మన్నారు. అలాగే మురికి నీటిని శుద్ధి చేసే ప్రాజెక్ట్ అందుబాటులోకి తీసు కువచ్చేందుకు ప్రయత్నాలు వేగవంతం చేశామన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు నగర పంచాయతీ ఎఇ శ్రీనివాస్, ఆర్ఐ భాస్కర రావు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ, నగర పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇవిఎంల గొడౌన్ పరిశీలన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

నగరంలోని ఎఫ్‌సిఐ గొడౌన్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఇవిఎంల స్ట్రాంగ్ రూమ్‌ను కలెక్టర్ కీర్తి చేకూరి, నోడల్ అధికారి, ఆర్‌డిఒ ఆర్.కృష్ణనాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఇవిఎంల భద్రతపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచిని ఇవిఎంలపై నిరంతర సీసీ కెమెరాల ద్వారా ప్రత్యక్ష పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన సిసి కెమెరాల పనితీరు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం సంబంధిత రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ తహశీల్దార్ పి హెచ్‌జిఆర్.పాపారావు, టిడిపి, బిజెపి పార్టీల నాయకులు, భద్రతా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పదవి అలంకార ప్రాయం కాకూడదు

ప్రజాశక్తి - తాళ్లపూడి

ఏ వ్యక్తికైనా పదవి అలంకారప్రాయం కాకూడదని పదవీకాలంలో సంఘ అభివృద్ధికి కృషి చేస్తూ ప్రతి ఒక్కరికీ సేవలు అందించాలని ఎఎస్ఒ జోడాల వెంకటేశ్వరరావు అన్నారు. తాళ్లపూడి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షునిగా నియమితులైన అప్పన రాజాకు తాళ్లపూడి ప్రెస్ క్లబ్ మంగళవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో జోడాల పాల్గొని మాట్లాడారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ జొన్నకూటి ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు అప్పన రుక్మాంగదరావు, సత్యనారాయణ, బ్రహ్మానందం, చినబాబు, భాస్కర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో మంగళవారం సర్వారాయ సుగర్స్ ప్రాంగణంలో పర్యావరణ పరిరక్షణ చట్టం-1986పై న్యాయ అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి హాజరై మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. కాలుష్యం వల్ల కలిగే నష్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ చట్టంలోని ముఖ్య నిబంధనలను వివరించారు. ఈ సందర్భంగా ప్రొటెక్ట్ టుడే సెక్యూర్ టుమారో పేరుతో ముద్రించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. పర్యావరణానికి సంబంధించిన న్యాయ సమస్యలు ఎదురైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. ఈ సదస్సులో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రీసెర్చ్ ఫెలో నాగ జ్యోతి, సర్వారాయా షుగర్ జనరల్ మేనేజర్ కె.కృష్ణమూర్తి, సిఎఫ్ఒ శ్రీధర్, సంస్థ కార్మికులు, లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్, పారా లీగల్ వాలంటీర్ గొల్ల దినేష్ కుమార్ పాల్గొన్నారు.

శతాబ్ది ఉత్సవాల క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- దేవరపల్లి

దేవరపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం వందో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ముద్రించిన క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఆప్కాబ్ డిసిసిబి ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, దేవరపల్లి సొసైటీ ఛైర్మన్ ఉప్పులూరి నోమేంద్ర రామారావు దీన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి టిడిపి సీనియర్ నాయకులు గన్నమణి హరికృష్ణ, సురేంద్ర సొసైటీ సెక్రటరీ శ్రీనివాస వర్మ పాల్గొన్నారు

దస్తావేజులు పోయినవి

నిడదవోలు మండలం, అట్లపాడు గ్రామం, డోర్.నెం.3-145, కాపురస్తులు, సురేష్‌బాబు పుచ్చకాయల, తండ్రి: వెంకటేశ్వరరావు, అను నాయొక్క ఒరిజినల్ దస్తావేజులు నెం.3751/2019, 7026/2016 గల డాక్యుమెంట్స్ ది. 20-11-2025 తేదీన జిరాక్స్ తీయించుకొను నిమిత్తం వెళ్ళుచుండగా సమిశ్రగూడెం చెఱువుగట్టు పరిశర ప్రాంతాలలో పోయినవి. కావున ఎవరికైనా దొరికినచో నాకు అందజేయగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును.

సురేష్‌బాబు పుచ్చకాయల, తండ్రి : వెంకటేశ్వరరావు
సెల్ : 9642421404

పాస్ పోర్టు పడిపోయినది

డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మాచవరం శివారు పోతాయిలంక తాటికాయల చెరువుకు చెందిన నివసముంటున్నాను. ది. 15-12-2025 తేదిన నేను పాస్‌పోర్టు నెం.PSP23983 ను జిరాక్స్ తీయించుకొనేందుకు అంబాజీపేట సెంటర్ కు వెళుతుండగా దారిలో పడిపోయినది. దయచేసి నాపాస్ పోర్టు దొరికినవారు ఈ క్రింది అడ్రస్ కు పంపకోరుచున్నాను.

కుసుమే సుగుణ
D/o.సుందరరావు.
మాచవరం శివారు పోతాయిలంక,
అంబాజీపేట మండలం
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా.
సెల్: 9949377971

ప్రకటన

సున్నం జయలక్ష్మి భర్త శ్రీనివాసరావు, డోర్‌నెం.18-21-4, శ్రీకృష్ణనగర్, రాజమండ్రి, తూ॥గో॥జిల్లాలో నివసిస్తున్న నేను ఇందుమూలంగా తెలియజేయునది. తూ॥గో॥జిల్లా పిఠాపురం మండలం సింహాద్రిపురం డోర్‌నెం.4-50B కాపురస్తులు అయిన గోపు నూకరాజు గారి కుమారుడు గోపు సూర్యరావు గారికి నాపేరున గల ACCESS125, AP05CX0595 నెంబరు గల స్కూటర్‌ను OLX ద్వారా అమ్మగా నాకు అడ్వాన్స్ ఇచ్చి 15-11-2024వ తేదిన స్కూటర్‌ను తీసుకొని వెళ్ళియున్నారు. అప్పటినుండి ఇప్పటి వరకు రిజిష్ట్రేషన్ చేయించుకోమని ఎంత అడిగినను వారి పేరున చేయించుకోవడంలేదు. మరియు నాకు ఇవ్వవలసిన డబ్బు కూడా ఇవ్వడం లేదు సదరు సూటర్‌పై ఏవిధమైన లావాదేవీలు చేసిన నేను తీసుకొను సివిల్ క్రిమినల్ కేసులకు బాధ్యులుగుదురని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

సున్నం జయలక్ష్మి
భర్త సున్నం శ్రీనివాసరావు
9441426044